క్లుప్తంగా

శివాలయంలో భక్తుల ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

చెన్నూర్: చెన్నూర్ శివాలయంలో భక్తులు పోటెత్తారు. శివనామస్మరణతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. శ్రావణ మాసంలో తొలి సోమవారం సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయంలో అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు మహేశ్వర్‌శర్మ పాల్గొన్నారు.

సస్పెన్షన్ ఎత్తివేయాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

చెన్నూర్: చెన్నూర్ నలగొండ పోచమ్మవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయునిపై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ అన్నారు. ఉపాధ్యాయునిపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట రాస్తారోకో నిర్వహించారు. జిల్లా విద్యాధికారి వెంటనే సస్పెన్షన్ ఎత్తివేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనట్లైతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి బీఆర్ఎస్వీ నాయకులను పోలీసుస్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సంపత్‌కుమార్, నాయబ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అటెండరే దిక్కు!



బోసిపోయిన ఎంపీడీవో కార్యాలయం

కోటపల్లి: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అందుబాటులో ఉండాల్సిన అధికారులు విధులకు డుమ్మా కొట్టడంతో ఆఫీసుకు వచ్చిన బాధితులకు ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. సోమవారం ప్రజావాణికి ఫిర్యాదులు ఇవ్వడానికి, ఇతర పనుల కోసం ఎంపీడీవో కార్యాలయానికి వస్తే అటెండరే సమాధానం ఇచ్చి పంపించారు. ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి లీవ్‌లో ఉండగా కార్యాలయంలో ఉండాల్సిన సీనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్ ఆఫీస్‌కు రాకపోవడంతో కార్యాలయానికి వచ్చిన వారికి సమాధానం ఇచ్చే వారే కరువయ్యారు. ఈ విషయంపై ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డిని వివరణ కోరగా కార్యాలయానికి లీవ్ పెట్టకుండా విధులకు డుమ్మా కొడితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలన



భోజనాన్ని పరిశీలిస్తున్న శ్రేణులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ అంబేడ్కర్ రడగంబాల బస్తీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎమ్మార్పీఎస్ శ్రేణులు సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. పాఠశాల పరిసరాలు, వంటగదిలో ఉన్న సౌకర్యాలు తనిఖీ చేసి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని శ్రేణులు పాఠశాల ఉపాధ్యాయుడికి సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు మహేశ్, శ్రేణులు రాజేష్, సాయి పాల్గొన్నారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రారంభమైన అడ్మిషన్లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మహాత్మా జ్యోతిభాపూలే(ఎంజేపీ) పురుషుల డిగ్రీ గురుకుల కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల కోసం అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్‌సీవో సేరు శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంజేపీ డిగ్రీ కళాశాల మంచిర్యాల కాలేజ్ రోడ్ నుంచి పాత ప్రతిభ జూనియర్ కళాశాల భవనంలోకి మార్చబడుతుందని తెలిపారు. ఇక ఇంటర్ మార్కుల ఆధారంగా అర్హత గల విద్యార్థులు ఆగస్టు 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అడ్మిషన్లకు సంబంధించి పూర్తి వివరాలకు 96037 05803, 91373 81807 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

అర్బన్ సెంటర్‌లో అరకొర వైద్యం

- అన్ని వసతులున్నా అధికారికంగా ప్రారంభించని వైనం..
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- కేటాయించిన సిబ్బందికి డిప్యూటేషన్



నస్పూర్: పేద ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పట్టణంలో యూపీహెచ్‌సీ (అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్)ని ఏర్పాటు చేసింది. పట్టణ పరిధిలోని తీగల్‌పహాడ్ పాత గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని అధికారులు యూపీహెచ్‌సీకి కేటాయించారు. ఆసుపత్రి నిర్వహణకు అణుగుణంగా అన్ని ఏర్పాట్లు చేశారు. నిర్వహణకు కావాల్సిన ఫర్నీచర్ సైతం ఇటీవల అందుబాటులోకి వచ్చింది. కానీ నేటి వరకు ఆసుపత్రిని అధికారికంగా ప్రారంభించడానికి అధికారులు చొరవ చూపడం లేదు. సిబ్బంది కేటాయింపు, ఆసుపత్రి నిర్వహణకు ఒక మెడికల్ ఆఫీసర్, ఇద్దరు స్టాఫ్ నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టు, డాటా ఎంట్రీ అండ్ ఆపరేటర్, సపోర్టింగ్ స్టాఫ్ విభాగాల్లో ఒక్కొక్కరిని కేటాయించారు.

డిప్యూటేషన్‌పై స్టాఫ్..

యూపీహెచ్‌సీని అధికారికంగా ప్రారంభించనప్పటికీ కొద్దిరోజులుగా ఆసుపత్రిలో తాత్కాలికంగా వైద్య సేవలు అందిస్తున్నారు. మెడికల్ ఆఫీసర్, స్టాఫ్ నర్సు, సపోర్టింగ్ స్టాఫ్ ఒక్కొక్కరు అందుబాటులో ఉండగా, మిగిలిన సిబ్బంది మొత్తం డిప్యూటేషన్‌పై వివిధ ఏరియాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు.

ప్రారంభిస్తే ఎంతో మేలు..

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. డిప్యూటేషన్‌పై వివిధ ఏరియాల్లో విధులు నిర్వర్తిస్తున్న స్టాఫ్‌ని ఇక్కడికి బదిలీ చేసి, ఆసుపత్రిని అధికారికంగా ప్రారంభించి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తే ప్రజలకు వైద్య పరంగా ఎంతో మేలు జరుగుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

తగ్గనున్న దూరభారం..

శ్రీరాంపూర్ ఏరియాలోని ప్రజలు, గర్భిణులు వైద్య నిమిత్తం నస్పూర్‌లోని తోళ్ల వాగు సమీపంలో గల పీహెచ్‌సీకి వెళ్లాల్సి వస్తుంది. తీగల్‌పహాడ్ పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆసుపత్రిని ప్రారంభించి వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తే ప్రజలకు దూరభారం సైతం తగ్గనుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

> **ఉన్న సిబ్బందితో వైద్య సేవలు**
>
> ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొద్దిరోజులుగా యూపీహెచ్‌సీలో వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రస్తుతం ఒక స్టాఫ్ నర్సు, ఒక సపోర్టింగ్ స్టాఫ్ అందుబాటులో ఉన్నారు. మిగితా స్టాఫ్ డిప్యూటేషన్‌పై వివిధ ఏరియాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు.
>
> – సమత, మెడికల్ ఆఫీసర్

గురుకులాన్ని తరలించేది లేదు

- ఎమ్మెల్యే గడ్డం వినోద్

సాక్షి ఎఫెక్ట్..



ఎమ్మెల్యే వినోద్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తాండూర్: మండలంలోని మహాత్మజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను వేరే చోటికి తరలిపోనిచ్చేది లేదని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ స్పష్టం చేశారు. 'సాక్షి' దినపత్రికలో సోమవారం 'మరో సారి తరలింపు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్థానిక నాయకులు స్పందించి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను వేరే చోటికి తరలిపోకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని, అవకాశాలన్ని పరిశీలించి ఇక్కడే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వినోద్ స్థానిక అధికారులను ఆదేశించారు. గురుకుల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని గుర్తించి ఉన్నతాధికారులకు పంపించేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. ప్రస్తుతం గురుకుల నిర్వహణ కోసం అనువైన భవనాలను సైతం పరిశీలించనున్నట్లు వారు తెలిపారు. 'సాక్షి' కథనంపై స్థానికులు హర్షం చేశారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు



స్టాక్ వివరాలు పరిశీలిస్తున్న అధికారులు

బెల్లంపల్లిరూరల్: ఎరువుల డీలర్లు యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ కృష్ణ, తాళ్లగురిజాల ఎస్సై బి.రామకృష్ణ అన్నారు. టాస్క్‌ఫోర్స్ టీమ్ సోమవారం మండలంలోని చాకేపల్లి గ్రామంలో ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్‌లో నమోదు చేసిన యూరియా స్టాక్ వివరాలను పరిశీలించారు. అనంతరం బుధాకుర్థు లోని రైస్ మిల్‌ను తనిఖీ చేసి, రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారని పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్.ప్రేమ్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

యూరియా అధిక ధరలకు విక్రయించొద్దు

కోటపల్లి: యూరియా కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల టాస్క్‌ఫోర్స్ అధికారులు తహసీల్దార్ రాఘవేందర్ రావు, ఏవో సాయికృష్ణ డీలర్లను ఆదేశించారు. మండలంలోని ఫెర్టిలైజర్స్ షాపులను సోమవారం తనిఖీ చేసి యూరియా నిల్వల వివరాలను డీలర్లను అడిగి తెలుసుకుని రికార్డులు పరిశీలించారు.

'అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆరోపణలు'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గంలో 20ఏళ్ల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పాలనలో జరగని అభివృద్ధిని, ప్రస్తుత ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఏడాదిన్నరలోనే చేసి చూపించడంపై ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే, తమ ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తున్నారని మంచిర్యాల పట్టణ కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేశ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూదరి తిరుపతి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజల మీద రుద్దే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అధికారుల మీద నిందలు వేస్తూ, భయభ్రాంతులకు గురిచేసి, అభివృద్ధిని అడ్డుకునేందుకు చూస్తున్నారని, అధికారులకు అండగా తమ ఎమ్మెల్యే ఉన్నారన్నారు. ప్రజలు మరో పదేళ్ల ప్రజాప్రభుత్వాన్ని, తమ ఎమ్మెల్యేనే ఎన్నుకుంటారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ సల్ల మహేశ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ వసుంధర, ప్రభాకర్, మాజీద్, సదానందం, కిషన్, నగేశ్, సత్తమ్మ, సింగతి మురళి, పెంట రజిత, గజ్జల హేమలత, అర్కల హేమలత పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే హెపటైటిస్ నివారణ సాధ్యం



కేజీబీవీలో మాట్లాడుతున్న సుధాకర్‌నాయక్

జన్నారం/చెన్నూర్/లక్సెట్టిపేట/మంచిర్యాలరూరల్(హాజీపూర్): వ్యక్తిగత పరిశుభ్రతతో హెపటైటిస్‌ను నివారించవచ్చని వైద్యులు తెలిపారు. ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా సోమవారం చెన్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామంలోని కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయంలో, జన్నారం మండలం తపాలపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఊత్కూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వ్యాధిపై వైద్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కర్ణమామిడిలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ హైపటైటీస్ ప్రోగ్రాం అధికారి సుధాకర్‌నాయక్, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, చెన్నూర్‌లో వైద్యులు కృష్ణతేజ, లక్ష్మీ ప్రసన్న, తపాలపూర్‌లో హెల్త్ అసిస్టెంట్ కొల్లూరి కమలాకర్, ఊత్కూరులో ఏఎన్ఎం హెలెన్, విజయలక్ష్మితదితరులు పాల్గొన్నారు.

సమాచారం

● 30న వాహనాల వేలం

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో వివిధ నేరాలపై పట్టుబడిన 15ద్విచక్ర వాహనాలను ఈ నెల 30న వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ సమ్మయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు దరావత్తు సొమ్ము చెల్లించి కార్యాలయంలో నిర్వహించే వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

● భీమారం ఆర్ఐగా అనూషా

భీమారం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అనూషాను ఆర్ఐగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్వర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేసిన స్రవంతిని మంచిర్యాల ఆర్డీవో కార్యాలయానికి, అక్కడ పనిచేస్తున్న అనూషాను ఇక్కడికి కేటాయించినట్లు తహసీల్దార్ తెలిపారు.

● మోడల్‌స్కూల్లో స్పాట్ అడ్మిషన్లు

కోటపల్లి: మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్లో 6 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లలో స్పాట్ అడ్మిషన్లు తీసుకోనున్నట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో చేరే విద్యార్థులు ఈ నెల 30, 31వరకు స్పాట్ అడ్మిషన్‌కు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు మోడల్‌స్కూల్లో సంప్రదించాలని కోరారు.

● సెర్ప్ ఏపీఎం బదిలీ

నెన్నెల: మండల ఏపీఎం విజయలక్ష్మి బెల్లంపల్లికి బదిలీ అయ్యారు. పదేళ్లుగా మండలంలో సేవలందించిన మహిళా సాధికారిత కోసం విశేష కృషి చేశారు. స్వయం సహాయక సంఘాల ఏర్పాటు, రుణాల మంజూరు, రికవరీలో మండలాన్ని అగ్రస్థానంలో నిలబెట్టారు. ఆమె సేవలకు గుర్తింపుగా పలుమార్లు జిల్లా స్థాయి ఉత్తమ సేవా అవార్డులు అందుకున్నారు. ఆమె స్థానంలో భీమారం ఏపీఎం త్రయంబకేశ్వర్ నెన్నెలకు రానున్నారు.

మాలగురిజాలలో భూ వివాదం



ఇరువర్గాలతో మాట్లాడుతున్న ఎస్సై రామకృష్ణ

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం మాలగురిజాలలో భూ వివాదం నెలకొంది. గ్రామానికి చెందిన ఏగోలపు రమాదేవికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. దీంతో సోమవారం రమాదేవి తమ స్థలంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం పునాది పనులు చేపట్టింది. ఈ క్రమంలోనే కామెర లక్ష్మి కుటుంబీకులు రమాదేవి పునాది తవ్వుతున్న చోటుకు వెళ్లి పునాది పనులను అడ్డుకోవడంతో గొడవ జరిగింది. దీంతో రమాదేవి కుటుంబీకులకు, లక్ష్మి కుటుంబీకులకు ఘర్షణ తలెత్తింది. ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటే కిరోసిన్ పోసుకొని తామంతా ఆత్మహత్యకు పాల్పడుతామని రమాదేవి కుటుంబీకులు బోరున విలపించారు. దీంతో గ్రామంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ ఘటన విషయాన్ని తాళ్లగురిజాల పోలీసులకు సమాచారం అందించగా తాళ్లగురిజాల ఎస్సై బి.రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకొని ఇరు కుటుంబాలను సముదాయించారు. దీంతో గొడవ సద్దుమనిగింది. అనంతరం ఇరువర్గాల వారు, గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. ఘటన విషయాన్ని తహసీల్దార్ కృష్ణతో విన్నవించగా భూ సమస్య ఉంటే సామరస్యంతో తేల్చుకోవాలని, వారం రోజుల్లో ఇరువర్గాల వారు సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్, ఎస్సై హెచ్చరించారు.

'వసతి' ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

తాండూర్: మండలంలోని ఎస్సీ బాలుర వసతి గృహం నిరుపయోగంపై ఈ నెల 23వ తేదీన 'సాక్షి' దినపత్రికలో 'వసతి నిరుపయోగం' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించారు. మండలంలోని విద్యాభారతి ఉన్నత పాఠశాలలోని కొంత సముదాయాన్ని అద్దెకు తీసుకొని, వసతి గృహాన్ని సోమవారం ప్రారంభించారు. షెడ్యూల్ కులాల ఉపసంచాలకులు దుర్గాప్రసాద్ ఆదేశాలను సారం అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రవీందర్ గౌడ్ నూతన వసతి గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఉన్న భవనం శిథిలావస్థకు చేరడంతో అద్దె భవనంలో నూతనంగా వసతి గృహం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అందుకు అనుగుణంగా హాస్టల్‌కు వార్డెన్‌ను కేటాయించినట్లు తెలిపారు. హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్ రజనీకాంత్, భవన యజమాని సురభి ఆగమరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బకాయిలు చెల్లించాలి

- ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.40వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. ఆర్కే 5 గనిపై సోమవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కంపెనీ గత ఆర్థిక సంవత్సరం సాధించిన వాస్తవ లాభాలను ప్రకటించి, అందులో నుంచి 35శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. గత గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ కాలంలో ఏనాడు స్ట్రక్చర్ సమావేశాలు జరగలేదని, తాము గెలిచిన తర్వాత యాజమాన్యంతో చర్చించి విధిగా ఈ సమావేశాలు నిర్వహిస్తూ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ఇంకా ఇతర ప్రధాన డిమాండ్ల సాధన కోసం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా, జీఎం కమిటీ చర్చల ప్రతినిధులు బద్రి బుచ్చయ్య, సంపత్, నాయకులు సుధాకర్, అఫ్రోజ్ ఖాన్, ఫిట్ సెక్రెటరీ నర్సింగరావు, లక్కిరెడ్డి సత్తిరెడ్డి, మల్లేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల ఫిట్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన బీసీ కమిటీ నాయకులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ ఓపెన్ కాస్ట్ గనిలో సింగరేణి కాలరీస్ బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన ఫిట్ కమిటీని ఎన్నుకున్నారు. గనిపై సోమవారం జరిగిన సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శులు బరుపటి మారుతి, బద్రి బుచ్చయ్య, సహాయ కార్యదర్శి చంద్రమోహన్‌ల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ చీఫ్ అడ్వైజర్‌గా శ్రీధర్ రావు, ఫిట్ కార్యదర్శిగా వీర్ల మదన్, సహాయ కార్యదర్శిగా మల్లెత్తుల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా ఆర్. వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జీ. మల్లేష్, కోశాధికారిగా దుబ్బల రవి, కార్యవర్గ సభ్యులుగా ఇత్తినేని శంకర్, వెంకటేశ్, వినీషా, హేమలత, జీ.మల్లేష్, బీ. శ్రీనివాస్, టీ. సురేష్, రిలే ఇన్చార్జిలుగా స్వామి, లక్ష్మీనారాయణ, ఓదెలు, పీ.రాజేందర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శంకరయ్య, దేవేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో కార్మికులకు మెరుగైన వైద్యం అందించేందుకు కంపెనీనే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆర్కే న్యూటెక్ గనిపై సోమవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికుల ప్రధాన డిమాండ్ల పరిష్కారాల సాధన కోసం బీఎంఎస్ దశల వారి పోరాటాలకు పిలుపునిచ్చిందన్నారు. కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి రాగం రాజేందర్, నాయకులు మల్లయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

నాణ్యమైన పనిముట్లు ఇవ్వాలి



సమావేశంలో జీఎం, అధికారులు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎంఓస్ ఆవరణలో గల కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ఏరియా జీఎం దేవేందర్ ఆధ్వర్యంలో ఏరియా ప్రాతినిధ్య సంఘమైన ఏఐటీయూసీ నాయకులతో 8వ స్ట్రక్చర్ మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్‌లో ఏఐటీయూసీ నాయకులు పలు సమస్యలు జీఎం దృష్టికి తీసుకొచ్చారు. ఉద్యోగులకు నాణ్యమైన పనిముట్లు ఇవ్వాలని, కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తన పరిధిలోని సమస్యలు పరిష్కరిస్తానని జీఎం తెలిపారు. ఎస్వోటు జీఎం విజయ్‌ప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, అధికారులు ఉన్నారు.

కోర్సులపై అవగాహన

శ్రీరాంపూర్: సీసీసీలోని సింగరేణి పాలిటెక్నిక్ కాలేజీలో సోమవారం కోర్సులపై ప్రిన్సిపాల్ బీ.శ్రీనివాస్ రావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొదటి సంవత్సరం చేరిన విద్యార్థులకు, వారు చేరిన కోర్సుల ప్రాధాన్యతను, వాటి ద్వారా భవిష్యత్తులో చేసే కోర్సులను, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీలు నర్సింహారావు, నారాయణ మూర్తి, రవీందర్, జీ.దామోదర్, శ్యామల, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తున్న క్రీడాకారులకు యాజమాన్యం ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బండి రమేష్, సంయుక్త కార్యదర్శి సత్తయ్యలు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

సంక్షిప్త వార్తలు

● ఫర్టిలైజర్ షాపులపై చర్యలు తీసుకోవాలి

భీమిని: యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్న ఫర్టిలైజర్ షాపులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు పీవైఎల్, ఏఐకేఎంఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుర్మ మనోహర్, ఏఐకేఎంఎస్ కొడిపే వెంకటేష్ వినతిపత్రంలో కోరారు.

కోటపల్లి: చెన్నూర్ నియోజకవర్గంలోని రైతులను నిలువుదోపిడీ చేస్తున్న ఫర్టిలైజర్స్ షాపులపైన చర్యలు తీసుకోవాలని నేషనలిస్టు కాంగ్రెస్‌పార్టీ, తెలంగాణ జనసమితి పార్టీల ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఛత్రునాయక్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నేషనల్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు గోపాల్, నాయకులు ప్రవీణకుమార్, గణపతి, రాజేశ్, సమ్మయ్య పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

చెన్నూర్‌రూరల్: మండలంలోని పొక్కూరు, దుగ్నెపల్లి గ్రామాల్లోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలల్లో సోమవారం మహిళా సాధికారిత అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డీహెచ్ఈ డబ్ల్యూ మెంబర్స్, ఫైనాన్షియల్ అధికారి లిప్సిక, జెండర్ స్పెషలిస్టు విజయ పాల్గొని విద్యార్థులకు 1098, 1930, 1811, 100 హెల్ప్‌లైన్ నంబర్స్ గురించి, లింగ వివక్షతపై వివరించారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు దత్తకుమార్, బానయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ధర్నా విజయవంతం చేయండి

మందమర్రిరూరల్/భీమిని: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఆగష్టు 1న జిల్లా కేంద్రంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్ పీసీ) నాయకులు పిలుపునిచ్చారు. మందమర్రి ప్రాథమిక ఉన్నత పాఠశాల, కన్నెపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూఎస్‌పీసీ నాయకులు జయకృష్ణ, సతీష్, సంజీవ్, భుక్యా కిరణ్, కాశీ ప్రకాష్, దేవ రమేష్, విజయలక్ష్మి ఉన్నారు.

● 'ఆత్మ' చైర్మన్‌కు సన్మానం

కాసిపేట: మండల కేంద్రానికి చెందిన మాజీ జెడ్పీటీసీ, ఆత్మ చైర్మన్‌గా ఎంపికైన రౌతు సత్తయ్యను సోమవారం మున్నూరుకాపు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు అట్టిపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఇంగు నారాయణ, జిల్లా యూత్ అధ్యక్షుడు తేంద్ర శ్యాం తదితరులు పాల్గొన్నారు.

● ప్రజావాణికి స్పందన కరువు

భీమారం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ప్రజల నుంచి స్పందన కరువైంది. ఎంపీడీవో మధుసూధన్, తహసీల్దార్ సదానందంతో పాటు వివిధ శాఖల అధికారులు హాజరైనా ప్రజావాణికి దరఖాస్తులు రాలేదు. ప్రభుత్వం ప్రజలకోసం ప్రవేశపెట్టిన ప్రజావాణికి సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

బ్యాగులు పంపిణీ

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో వెర్రబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఫౌండేషన్ చైర్మెన్ రఘునాధరావు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు హరిగోపాల్, రమేష్‌చంద్ పాల్గొన్నారు.